



# శవం చెప్పింది

షేక్ మస్తాన్ వలి

**ఆరడుగుల ఎత్తు, చింపిరి జుట్టు, బిత్తర చూపులు, తత్తర అడుగులు, మురికి శరీరం, అర్థం లేని పలుకులు, వెరసి అతనొక పిచ్చోడు. మొలకో చిన్న గుడ్డుంది.**

**ఆరు నెలలుగా అక్కడే తిరుగుతున్నాడు. పిల్లలకు ఆటవస్తువయ్యాడు.**

బడికి శలవైనందున పిల్లలు మాటలతో ఆగలేరు. కేరింతల మధ్య రాళ్ళిసురుతున్నారు. చురుక్కుమన్నప్పుడంతా గెంతుతుంటే పకపకలాడుతున్నారు.

"ఏంట్రా ఆ పని? బుద్ధి లేదా? ఎల్లండీ!" అటుగా వచ్చిన ఓ పెద్దమనిషి అదిలింపులకు పిల్ల గుంపు చెదిరింది.

పిచ్చోడు తన లోకంలోనే వున్నాడు.

పక్కనున్న రోడ్డుపై ఓ లారీ విసురుగా రావటం, ఓ మనిషిపైకెక్కటం, అతనాక్రందనం చేయటం క్షణాల్లో జరిగాయి.

పిల్లలు, పెద్దాయన అందరూ పరుగెత్తి లారీ చుట్టూ మూగున్న జనంలో కలిశారు.

షాక్ నుండి బయటపడ్డ డ్రైవర్ బ్యాక్ గేరేసి లారీని వెనక్కు లాగాడు. మనిషిపై నున్న ముందు టైర్ రోడ్డుపైకొచ్చింది. క్షతగాత్రుడు శ్వాశించాలని చూశాడు. కుదర్లేదు. చనిపోయాడు.

జనం శవాన్ని చూస్తున్నారు.

వయస్సు నలభై వుండొచ్చు. నల్లగా, పొడవుగా వున్నాడు. క్రాపు చెదిరింది. పంచె, చొక్కా సగందాకా రక్తంతో తడిసున్నాయి.

చూపర్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు.

ఎస్.ఐ. వెంకట్రావు రంగప్రవేశం చేశాడు. శవం తాలూకు వారికై ఎంక్వయిరీ చేశాడు. ఎవరూ రాలేదు. లారీని సీజ్ చేసి డ్రైవర్‌ను స్టేషన్‌కు లాక్కెళ్ళాడు. అతను లబోదిబో మంటున్నాడు.

ఫోటోగ్రాఫర్ యాక్సిడెంట్ స్పాట్‌ను రకరకాల యాంగిల్స్‌లో స్నాప్స్ తీశాడు. ఊరి పెద్దలతో పంచనామా ముగిసింది. డ్రైవర్‌పై కేసు బనాయించారు.

టైం రాత్రి ఏడైంది.

ఇద్దరు వెట్టోళ్ళు శవాన్ని బల్లరిక్షాపై వేశారు. రాత్రయినందున పోస్టుమార్టమ్ రేపని తేల్చాడు గవర్నమెంటు డాక్టర్.

శవం కాపలా కిట్టయ్య, రంగయ్య కానిస్టేబుల్స్ కప్పగించబడింది.

సర్వీస్‌లో కిట్టయ్య జూనియర్. వయస్సు ముప్పై. ఎర్రగా, బొద్దుగా వుండే అతను ధైర్య

వంతుడు. ఆ విషయంగా అతన్నందరూ మెచ్చుకుంటారు. దేన్నయినా ఒంటరిగా చేయ గలననే ధీమా మెండు. ఫలితం గర్వం తల కెక్కింది.

రంగయ్య వయస్సు నలభై. నల్లగా, ఎత్తుగా వుంటాడు. భయస్తుడు. ఐతే జూనియ రైనా కిట్టయ్యకు ధైర్యవంతుడని పేర్రావటం మిష్టం లేదు. ఈర్ష్య నిండా పేరుకొంది. అం దుకే కావాలని శవ కాపలా వేయించు కున్నాడు.

"రాత్రి కాపలాకు రెడీసార్!" కిట్టయ్య వెంకట్రావు చెప్పక ముందే అడిగాడు.

"నేను డబుల్ రెడీ సార్!" రంగయ్య ఉక్రోషంగా ముందుకొచ్చాడు.

"ఓకే బాబులూ!" డ్యూటీ ఖాయమైంది.

వారు చెరో టార్చితో స్పాట్ కొచ్చారు.

శవం మోసుకుని వెట్టోళ్ళు, వెనుక కిట్టయ్య, రంగయ్యలు బయలుదేరి మార్చురీ కెళ్ళారు.

చెరువు కట్టకొమ్మున చింత తోపునానుకో నున్న దాన్ని ఆ ప్రాంతాన పీనుగుల కొట్టం టారు.

అందులో ఓ గది, పంచ వున్నాయి.

గదిలోని పెద్ద బల్లను శవం కోయటాని కుపయోగిస్తారు. పంచలోని బెంచ్ వెయిటర్స్ వాడుకుంటారు.

వెట్టివాళ్ళు శవాన్ని మోసుకొస్తుంటే రంగయ్య టార్చేసి తలుపు రెక్కలు తెరచి లోని కెళ్ళి లైట్ స్విచ్ ఆన్ చేశాడు. కాని వెలగలేదు.

"డబ్బు కట్టలేదని కరెంటు కట్‌చేశార్లా గుందన్నా!" కిట్టయ్య టార్చితో వెట్టోళ్ళకు దారి చూపాడు.

"తూ నీయమ్మ! ఈ డాక్టర్‌గాడేదీ పట్టించు కోడు. అందుకేనేమో రాత్తిరయితే చాలు శవ కోత కుదరదంటాడు." విసుక్కున్న రంగయ్య టార్చి వెలుగు బల్లపై వేశాడు.

శవం పడ్డప్పుడు దభేల్‌మని శబ్దమైంది. వెట్టోళ్ళు దాని వంటిపైనున్న గుడ్డల్ని తొల గించి, ఓ గుడ్డను మొలకు చుట్టారు. కిట్టయ్య తలుపు రెక్కలు దగ్గరకు లాగి గడియ పెట్ట బోయాడు. అది పడ్లేదు. "ఏందన్నా యిదీ రిపేరే?" ముఖం చిట్లించాడు.

"ఎల్తాం దొరా!" వెట్టోళ్ళు రిక్షావాలాతో వెళ్ళిపోయారు.

పి.సి. లిద్దరూ వెయిటర్స్ బెంచీపై కూర్చు న్నారు. రంగయ్య టార్చేసి చుట్టూ చూస్తుంటే కిట్టయ్య కూడా చూపులు సారించాడు.

చిమ్మచీకట్లో చింతచెట్లు కొమ్మలిరబోసు కొని దయ్యాల్లా వున్నాయి. వాటి మధ్య పడున్న బండరాళ్ళు డైనోసారా జాతి జంతువుల్ని తలపిస్తున్నాయి. చెట్ల మధ్యగా వచ్చే గాలి విసుర్లు, కొమ్మల్లో గుడ్లగూబల అరుపులు, పొదల్లో కీచురాళ్ళ రొదలు, చెర్లో కప్పల బెకబెకలు, పొలాల్లో నక్కల వూళలు, పొలి మేర్లలో కుక్కల భౌభౌలు, వాటి మధ్య పీనుగుల కొట్టు కలిసి వాతావరణం భయం గొల్పుతోంది.

రంగయ్య బ్రమ్మన్నడి చూస్తున్నాడు.

'ఏందన్నా! ఈడొక యీద్దీపం కూడా లేదు. అయినా యీ డాక్టర్ మొద్దుకివేం పట్టవా? ఏమైనా సరే రేపు ఎస్.ఐ.కి. చెప్పి ఆ ఏర్పాటు చూడాల్సిందే" కిట్టయ్య మౌనాన్ని బద్దలు చేశాడు.

"అట్టాగే సేయాలయ్యా.. నాయాల్ది వాళ్ళ కేం? ఇంట్లో ఎచ్చంగా తొంగున్నారు. చలిలో, చీకట్లో ఈ శవంతో చచ్చేది మనమేగా"

కాసేపు పిచ్చ పాటి సాగింది.

"నా సర్వీస్‌లో ఇది ముప్పయ్యో శవ కాప లాన్నా. వాటిలో సగానికి పైన ఒక్కడ్నే కాశా.. నాకసలు భయమే లేదు. ఎంతయినా ప్రాణ ముంటే అవి మనుషులేగా" కిట్టయ్య సాహ సాన్ని చెప్పకనే చెప్పాడు.

"నాకూ అంతే" రంగయ్య బింకం జారనివ్వలేదు. కానీ అతనికి దడగానే వుంది. కారణం అతనికిదే మొదటిసారి.

"అన్నా చెబితే నమ్మవుగానీ, ముతా తగాదాల్లో ఓ శవముంది చూశావ్"

'నే చూడ్లేదే"

"నువ్వు కాదన్నా నే చూశా"

"అట్టాగా!"

"నిజంగా గుండెలదిరే సీనన్నా"

"శవమంటే అంతేగదయ్యా"


"అలా కాదన్నా! దానికి కాళ్ళు చేతులు నరికి, బీర్జాలు కోసి నోట్లో కుక్కారు. ఆ రాత్రి నేనొక్కడ్నే కాపలా వున్నా"

"బచ్చాగాడు బడాయేత్తున్నాడు" లోలోన నిరసించిన రంగయ్య "ఆ అలాంటివి మనకు మామూలేగదయ్యా" కిట్టయ్యను నీరుగార్చాడు.

"ఈర్ష్య..ముండాకొడుక్కి. నా ధైర్యా

## ఆశల వసంతం

కొత్త గొంతు వినపడాలని
కొత్త చిగుళ్ళు తొడుక్కోవాలనీ
కాలానికి ఎంత కాంక్ష!
ఊపిరి పోసుకున్న ప్రతి జీవీ
ఊహల ముంగిళ్ళలో
కోర్కెల రెపరెపలతో ఎగురుతుంది
ఆశలు రాసిరాశులై
మానవ జీవన భ్రమణంలో
వీడని స్థానాలై చలిస్తూంటాయి
గత క్రమాన్ని అనుసరిస్తూ పోయే
ధర్మసూత్రం
ఎడతెగని సంఘర్షణే!
లోకాలనే వశం చేసుకొని
గెలుపు తనదేనని విర్రవీగే రాక్షస
శక్తులన్నీ
లోకాభిరామమైన ఒక సుందర ధర్మ
తేజం ముందు
తల వాల్చాల్సిందే కదా?
ఆశలు ఎన్నెన్ని విధాలో మరి
అతనిపై అందాలూ కొలవలేనన్నే!
లేత లేత చిగుళ్ళ పొత్తిళ్ళలో
బాల జాబిల్లి కూనలల్లే
పూలగుత్తులు తొంగి చూస్తుంటే



సర్వ ప్రకృతిపైన ఆధిపత్యం
వహిస్తుంది
ఇక్కడి భూమికీ అక్కడి ఆకాశానికీ
ఇక్కడి మేధకీ అక్కడి వింతలకీ
సుతారమైన ఒక జిజ్ఞాసాయానం
గోళాలనించి గోళాలకి
సిద్ధ సంకల్పంతో సాగే ఆశల
ప్రయాణం
అనాటి నుంచీ సాగుతూనే వుంది
మనిషి మహర్షి అయితే దర్శించలేని
దారులుంటాయా
మేధస్సుకీ సంస్కారానికీ ఎప్పుడూ
ఆకుపచ్చదనాల అమ్మ భుజం మీంచి
శోకుల రాచబిడ్డలా వసంతకాలపు
గాలి
సాదరంగా వీస్తుంటే
ఇంద్రలోకం చంద్రలోకం యీ
భూమిపై వాలవా
ఎంత కాంక్ష మనిషికి
భూమికీ ఆకాశానికీ నిచ్చెనవేసి
గెలుపుల సవ్యసాచి కావాలని
కొత్త పల్లవి పాడాలని
కొంగ్రొత్త వసంతమై విరియాలని!

– ఆదూరి సత్యవతీదేవి

న్నొప్పుకోలేదు" కిట్టయ్య మనస్సు ఈసడించుకుంది.

"సర్లే కిట్టయ్యా! నేనెల్లి భోంచేసొత్తా.. తరువాత నీవెల్దుగానీ" రంగయ్యెళ్ళిపోయాడు.

చుట్టూ పరీక్షించొచ్చి కిట్టయ్య బెంచ్‌పై ధీమాగా కూర్చుని సిగరెట్టు ముట్టించాడు.

"వచ్చే ఆగస్టు యీ స్టేషన్లో దయర్యానికిచ్చే మెడల్ నాకుగాక యింకెవరి కొత్తది? నాయాల్ది ఎస్.ఐ.కి. గట్టిగా చెప్పాలి.. అప్పుడుగాని యీ రంగిగాడు కుళ్ళికుళ్ళి చావడు.. పిరికి నాయాలు" ఊహలు రేగుతుంటే దమ్ము జోరు పెంచాడు.

మధ్య మధ్య టార్చేసి పరిసరాలు గమనిస్తున్నాడు.

రంగయ్యొచ్చి కిట్టయ్యను భోజనానికి పంపాడు.

ఒంటరైన అతనికి బిక్కుబిక్కుగుంది. ధైర్యాన్ని కూడగట్టుకునే యత్నంలో టార్చీ, లాటీలను చేతులతో తడిమి ముడుచుకొని కూర్చున్నాడు. చలేస్తుంటే మఫ్లర్ చుట్టుకున్నాడు. ఇప్పుడు కాస్త స్థిమితంగుంది.

చాలాసేపటికి వాచ్ చూసుకున్నాడు. పదైంది.

"ఎదవనాయాలు. కిట్టిగాడింకా రాలేదు యాడ సచ్చాడో?... ఏందో? మనిషి వంటరిగున్నాడనే యింగితం కూడా లేదు దున్నపోతుకి" గొణుక్కుంటూ బెంచ్‌పై నడుం వాల్చాడు.


పగలంతా ఆవలిస్తున్నాడేమో నిద్రపట్టేసింది.

మధ్యలో "ఊ ఊ" శబ్దం వినిపిస్తుంటే లేచి చెవులు రిక్కించాడు.

"నిజమే ఎక్కడ్నించి?" టార్చేసి చుట్టూ చూశాడు. ఏం కనిపించలేదు. శబ్దం కూడా ఆగింది.

"ఆ భ్రమ" సర్దుకొని పడుకోబోయాడు.

**ఉగాది**



**నిన్న మరలిన**
**తారణ, పచ్చని**
**తోరణాలు**
**కడుతుందనుకున్నా**
**త్రాగేనీరు లేక,**
**ఊళ్ళకు ఊళ్ళే**
**వలసపోయాయి**
**ప్రకృతి కూడా మోసగిస్తే,**
**అప్పులు తీర్చే దారి లేక**
**రైతుల ఆత్మహత్య**
**లెక్కువయ్యాయి**
**తీరని దుఃఖమే**
**మిగిల్చింది సునామీ**
**దోపిడీ, పగ, ప్రతీకారం,**
**ప్రభుత మారినా,**
**ప్రజల స్థితి షరా మామూలే**
**ఓహో పార్థివా!**
**స్వాగతం, సుస్వాగతం**
**నీవైనా గతంలోని**
**చేదును మరిపించు**
**ఉగాది తీపి తినిపించు**
**నిరాశా నిశీధిలో**
**ఆశల దివ్వెను వెలిగించు**

**- సి. రత్నమాంబ**

ఈసారి "ఊ ఊ" లతో, "హి హి హి" నవ్వులూ వినిపించాయి.

అంతే, రంగయ్యకు దడ మొదలైంది.

దూరంగా నక్కల వూళలు లీలగా వినిపిస్తున్నాయి.

"లాభం లేదు చూడాల్సిందే. శవాన్నెవరైనా ఎత్తుకుపోతే తలకు చుట్టుకుంటది. అయినా కిట్టిగాడొత్తే బాగుండు" మెల్లగా లేచి టార్చేసి అన్ని దిక్కులూ చూశాడు.

ఇప్పుడు శబ్దమెక్కడ్నించో తెలిసింది.

అది.. శవం గది.

అతని గుండెల్లో శతాబ్ది ఎక్స్‌ప్రెస్ పరుగెత్తింది. అమ్మమ్మ చెప్పే దయ్యాలు గుర్తొచ్చాయి.

"పరువుకు పోయి పరాన్ని నెత్తినేసుకున్నావ్" మనస్సు ఒకటే తిట్టూంది.

ఐనా తప్పదు. డ్యూటీ కదా!

గది తలుపులు తెరిచాడు. కిర్రుమన్నాయి. గాలి తెర విసురుగా వీచింది. గుడ్లగూబ అరుపులు గుబులు పుట్టిస్తున్నాయి. మిణుగురు పురుగులు తళుక్కుమంటున్నాయి.

"శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం" అంటూ ఓ చేత్తో టార్చీ మరో చేత్తో లాటీని పట్టుకొని బెరుగ్గా గదిలో కదుగెట్టాడు.

"ఊ ఊ" టార్చి వెలుగులో నిలువెత్తు నల్లటాకారం వురిమి, "హి హి హి" అని నవ్వుతూ చేతులు గాలిలో వూపసాగింది.

రంగయ్య హడలెత్తాడు. వణుకు మొదలైంది. చెమటలు కారాయి. కాళ్ళ క్రింద భూమి అదిరినట్టయింది.

"శవం దయ్యమైంది బాబోయ్.. దయ్యం.. దయ్యం" అసంకల్పితంగా అరిచాడు.

అవయవాలు పట్టు తప్పాయి.

చేజారి పడిన టార్చి కదలసాగింది. దాని వెలుగులో ఆకారపు నీడ గోడపై పెద్దదిగా కనిపించి వూగిసలాడింది.

మరుక్షణం స్పృహ కోల్పోయి ధబేల్‌మని పడ్డాడు. టార్చి అతని కిందపడి వెలగడం మానేసింది.

గది చీకటైంది. నిశ్శబ్దం ఆవహించింది.

అరగంట తరువాతొచ్చిన కిట్టయ్య ఖాళీ బెంచ్ చూసి "ఈ దొర ఒకటికో, రెంటికో వెళ్ళుంటాడు" అనుకొని కూర్చున్నాడు.

ఎంతకూ రంగయ్య రాకపోవటంతో అనుమానమొచ్చి లైటేసి కలయచూశాడు.

తలుపు తెరచుండటం ఆశ్చర్యమనిపించింది. లేచి గబగబా గదిలో కదుగెట్టి పరీక్షించాడు. రంగయ్య నేలపై పడున్నాడు. చలనం లేదు.

"ఏమైందిరా దేవుడా" ఆత్రంగా రంగయ్యను చేరబోయాడు.

"హి హి హి" అనే నవ్వు అతన్నాపింది.

అటుగా వెలుగు, చూపు రెండు మరల్చాడు.

గోడకు చేరగిల పడున్న నల్లటి ఆకారం వురిమి చూస్తోంది. కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి. చేతులు వింతగా కదులుతున్నాయి.

అంతే అతని మొండి ధైర్యం గండి పడింది. కళ్ళు బైర్లుకమ్మాయి. గుండె వేగం పెరిగింది. చెమట బట్టల్ని తడిపింది.





చదవండి! చదివించండి!!

ఆటవిడుపు

పిల్లల సచిత్ర మాస పత్రిక

ఏప్రిల్ 2005 సంచిక

విజ్ఞాన వినోదాల విపంచిక

"బాబోయ్ శవం లేచింది.. దయ్యమైంది. రంగిగాడు పడిపోయాడు ఇక్కడుంటే నా పని ఖతం.. బతికుంటే బలిసాకు తినొచ్చు" భయంతో వూర్లోకి పరుగెత్తాడు.

ఆ పరుగు పరుగు వెంకట్రావు యింటి ముందాగింది.

కాలింగ్ బెల్ నొక్కి వెంకట్రావును లేపి విషయం చెప్పి చివరిగా, "సార్! అట్టా దయ్యమైన శవం దెబ్బకు రంగయ్య చచ్చాడు. కాసేపుంటే నా గతీ అదే. ఎట్టాగో తప్పించుకొని బయటపడ్డా" అన్నాడు.

భయంతోను, ఆయాసంతోను వుక్కిరిబిక్కి రౌతున్న కిట్టయ్యను చూసి వెంకట్రావు "ధైర్యవంతుడనుకున్న ఇతనే యిట్లా వున్నాడంటే సమ్‌థింగ్ రాంగ్" అనుకున్నాడు.

"దయ్యమేంటి కిట్టయ్యా.. చిత్రంగా మాట్లాడ్తున్నావ్"

"లేద్సార్ నే కళ్ళారా చూశా"

"మరి శవమేమైందయ్యా?"

"అదేగద్సార్ దయ్యమైంది. ఇంతింత కళ్ళేసుకొని చేతులూపుకుంటూ నాపై పడబోయిందంటే నమ్మరేం?" మాటలు వత్తి పలికాడు.

"చూద్దాం పద" వెంకట్రావు పిస్టల్‌తో సహా నిముషాల్లో తయారయ్యాడు.

స్టేషన్‌కెళ్ళి ఇంకో నలుగురు పి.సి.లను, ఫైవ్‌లోడ్ టార్చిని తీసుకొని జీపులో మార్చురీ చేరాడు.

టార్చి వెలుగు శవం బల్లపై పడింది.

ఆశ్చర్యం. శవం భద్రంగా ఎలా వేశారో అలాగే వుంది.

బల్ల పక్కన రంగయ్య వెల్లకిలా పడున్నాడు. ముక్కు దగ్గర చేయుంచి పరీక్షించిన వెంకట్రావ్, "ఊపిరుంది. షాక్‌లో వున్నాడు. అంతే. ఆయన్ను జీపులోకి చేర్చండి" అని పి.సి.లకు పురమాయించాడు. వాళ్ళలాగే చేశారు.

ఇప్పుడు వెంకట్రావ్ లైట్‌ను రెండో మూలకేశాడు.

"హి హి హి" నవ్వుతూ నల్లని ఆకారం చివాలున లేచింది.

"దయ్యం ర్రోయ్" అనే భయం అందర్నీ క్షణకాలం వూపేసింది.

"ఊ ఊ.. అలాంటి స్కోపే లేదు" వెంకట్రావ్ ఆకారం దగ్గరగా వెళ్ళాడు. మిగిలినోళ్ళు రెండడుగులు వెనకున్నారు.

అతను ఆకారాన్ని పరీక్షగా చూశాడు. అది ఆర్నెల్లగా వూర్లో తిరుగుతున్న పిచ్చోడని గ్రహించాడు.

"వీడు రాత్రిళ్ళు, గొళ్ళెం లేని మార్చురీలో పడుకుంటున్నాడన్నమాట. అదే అలవాటుగా ఈ రోజు రంగయ్య కునుకు తీసేటప్పుడు శవం గదిలో దూరాడు. అలికిడికి నిద్రలేచిన రంగయ్య పిచ్చోడ్ని చూసి దయ్యమనుకొని స్పృహ తప్పాడు. అటు శవం, ఇటు పిచ్చోడు మొలలకు తుండు గుడ్డలే వుండటంతో రంగయ్య శవమే దయ్యమైందని భ్రమించాడు. ఈ లోగా రంగప్రవేశం చేసిన కిట్టయ్య పడున్న రంగయ్యను, పిచ్చోడ్ని చూసిన భయంలో బల్లవైపు చూడకుండా శవం లేచిందని, అదే దయ్యమై రంగయ్యను చంపి తనపై దూకబోతుందని అనుకున్నాడు. ఐతే స్వతహాగా ధైర్యశాలైన అతను నిలదొక్కుకొని నా దగ్గరకొచ్చి సమాచారమివ్వగలిగాడు" పదునైన అతని బుర్ర జరిగిందాన్ని నిముషాల్లో అంచనా వేసింది.

అదే విషయాన్ని సిబ్బందికి వివరించి, పిచ్చోడ్ని రెక్క పట్టుకొని లాక్కెళ్ళి జీపెక్కించాడు. కిట్టయ్యతోపాటు మరో ఇద్దర్ని కాపాలాకొదిలి ఆ ప్రదేశాన్నొదిలాడు.

రంగయ్య హాస్పిటల్లో మరునాటికి కోలుకున్నాడు.

ఈ దుర్ఘటన కొంత కీడు చేసినా, కొన్ని మేళ్ళూ చేసింది.

ఒకటి: మార్చురీకి కరెంటు, వీధ్దీపం, గొళ్ళెం, తాళం ఏర్పాటు చేయబడ్డాయి.

రెండు : రంగయ్య ఈర్ష్య పోయింది.

మూడు : కిట్టయ్య గర్వం తగ్గింది. ←


ప్రియదత్తకు
పంచవర్ష జన్మదిన శుభాకాంక్షలు
మా ప్రియ పాఠకులకు, మా పంపిణీ సిబ్బందికి 'పార్థివనామ ఉగాది'
శుభాకాంక్షలు

శ్రీ శ్రీనివాసా ఏజెన్సీస్
ప్రొ.బి.ఎస్.ఎస్.వి.ప్రసాదరావు
డోర్ నెం.27-17-48, పెద్దిబొట్ల వారి వీధి,
గవర్నర్‌పేట,
విజయవాడ-502 002
ఫోన్: 0866 2571486
సెల్ నెం:9848585138

ఎన్.రామారావు
(న్యూస్ ఏజెంట్)
ఏజెంట్: ప్రియదత్త, ఆటవిడుపు,
సంతోషం, చిత్రాంజలి,
చిత్రం, సూపర్‌హిట్, మూవీ మార్కెట్,
స్వాతి, విజేత కాంపిటీషన్స్ మరియు ఇతర ప్రముఖ వార,
పక్ష, మాస పత్రికలు
పొన్నూర్-522 124
గుంటూరు జిల్లా
ఫోన్: 08643 245394
సెల్ నెం: 9247137340

పి.పాండురంగారావు
(న్యూస్ ఏజెంట్)
ఏజెంట్: ప్రియదత్త, ఆటవిడుపు,
మరియు ప్రముఖ వార, పక్ష, మాస
పత్రికలు
మున్సిపల్ ఆఫీస్ రోడ్,
రేపల్లె-522 265
గుంటూరు జిల్లా
ఫోన్: 08648 224592